క్లుప్తంగా

క్యాలెండర్, డైరీలు అందజేత



చిలప్‌చెడ్ ఇన్‌చార్జి తహసీల్దార్‌కు డైరీ అందిస్తున్న టీబీసీయూఎస్ సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం (టీబీసీయూఎస్) క్యాలెండర్, డైరీలను మంగళవారం చిలప్‌చెడ్ ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజకు అందజేశారు. ఈ సందర్భంగా టీబీసీయూఎస్ నర్సాపూర్ డివిజన్ అధ్యక్షుడు శేషాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, కృష్ణ, ఆర్థిక కార్యదర్శి కొండల్, రాష్ట్ర అదనపు కార్యదర్శి ప్రసన్న కుమార్ గౌడ్, సభ్యులు వెంకటకృష్ణ, మహేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాంగ ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణులు

పెద్దశంకరంపేట(మెదక్): శ్రీవిశ్వావసు నూతన సంవత్సర పంచాంగాన్ని మండల బ్రాహ్మణ సమాజ–సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక శివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సమాజ–సేవా సంస్థ అధ్యక్షుడు రామచంద్రాచారి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కృష్ణశర్మ, నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు కిషన్‌రావ్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, ఉమ్మడి జిల్లా అర్చక సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖరశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంతోష్‌శర్మ, నాగరాజ శర్మ, గిరిధర్, రామాచారి, ఫణిందర్, రాము, అనంతరాజ్, నర్సింహారావు ఉన్నారు.

ఘనంగా మల్లన్న ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

పాపన్నపేట(మెదక్): మండలంలోని తమ్మాయపల్లి మల్లన్న ఆలయ వార్షికోత్సవంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి మెలన్‌రెడ్డి, మెదక్ పట్టణాధ్యక్షుడు నాయిని ప్రసాద్, మండలాధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల అడ్డగింత



డీఎఫ్‌ఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఎస్.కొండాపూర్ గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ బస్టాప్ వద్ద వెలసిన సీతారాముల ఆలయ నిర్మాణ పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్. కొండాపూర్ గ్రామ శివారు అటవీప్రాంతంలోని ఏడిప్పల్ వద్ద ఉన్న సీతారాముల ఆలయ అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితమే అక్కడే లభించిన సీతరాముల విగ్రహాలకు ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నామన్నారు. ఇప్పుడు అభివృద్ధి పనులు మాత్రమే చేస్తున్నామన్నారు. గతంలో ఆలయ నిర్మాణం అనుమతి కోసం ఇచ్చిన తమ దరఖాస్తు పెండింగ్‌లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. అనంతరం మెదక్ డీఎఫ్‌ఓ కార్యాలయంలో ఆలయ పనులకు ఆటంకం కలిగించొద్దని గ్రామస్తులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, గ్రామ నాయకులు శ్రీశైలం, సిద్ధిరాములు, రవి, శంకర్‌గౌడ్, సందీప్, శేఖర్, నర్సింహులు, బాబు, గణేశ్, పరశురామ్, సంతోష్, దాసు, నాగరాజు ఉన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లిలో మల్లికార్జున జాతర కనుల పండువగా కొనసాగుతోంది. మంగళవారం మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బండ్లు, బోనాలను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పంచాయతీ భవనం హుళక్కేనా?

- కలగానే మిగిలిన భవన నిర్మాణాలు
- ఇబ్బందుల్లో అధికారులు, ప్రజలు

రేగోడ్(మెదక్): గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. పాలక వర్గానికి ఇబ్బందులు ఉండకూడదని గ్రామ పంచాయతీ కార్యాలయాల కోసం సొంత భవనాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. కానీ ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాల నిర్మాణం ఓ కలగానే మిగిలిపోయింది. మండలంలో నూతనంగా కొత్తగా ఆరు పంచాయతీలు ఏర్పాడ్డాయి. సంగమేశ్వర తండా, పెద్దతండా, తాటిపల్లి, తిమ్మాపూర్, వెంకటాపూర్, పోచారం గ్రామాలు పంచాయతీలుగా ఏర్పడటంతో పంచాయతీల సంఖ్య 18కి చేరింది. తాటిపల్లిలో 776, సంగమేశ్వర తండాలో 831, పెద్దతండాలో 687, తిమ్మాపూర్‌లో 573, వెంకటాపూర్‌లో 585, పోచారంలో 495 జనాభా ఉంది.

మూడు పంచాయతీలకు నిధులు మంజూరు

మండలంలోని వెంకటాపూర్, పెద్దతండా, సంగమేశ్వర తండా గ్రామ పంచాయతీలకు ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కేవలం వెంకటాపూర్ గ్రామంలో మాత్రమే పంచాయతీ భవన నిర్మాణం పనులు చకచకా కొనసాగుతున్నాయి. పనులు త్వరలో పూర్తయితే పాలనకు, సమావేశాలకు సౌకర్యాంగా ఉంటుంది.



సంగమేశ్వర తండాలో పాఠశాల భవనంలో కొనసాగుతున్న పంచాయతీ భవనం

మిగతా పంచాయతీల్లో అవస్థలు

వెంకటాపూర్ మినహా మిగతా 5 గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు ఇప్పటి వరకు సొంత భవనాలు నిర్మించలేదు. పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ భవనాల్లో కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. పంచాయతీలను చేసినా వాటి ఆలనా పాలనా కరువయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. ఎదురు చూపులే తప్ప నిర్మాణం కావడం లేదు. ఫలితంగా గ్రామసభల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. కావాల్సినంత స్థలం లేకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో అవస్థలు తప్పడం లేదని ప్రజలు చెప్తున్నారు. పంచాయతీ కార్యాలయాల కోసం సొంత భవనాలు నిర్మించాలని స్థానికులు పదేపదే కోరుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



వెంకటాపూర్‌లో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు

నిధులు మంజూరు చేయాలి

తండాలను పంచాయతీలుగా చేసినా.. నేటికీ నూతన భవనాలు నిర్మించలేదు. సొంత భవనం లేక పాఠశాల భవనంలో కార్యాలయం కొనసాగుతోంది. తండాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– సుభాశ్, బురాన్‌వాడి తండా



ఒక పంచాయతీలో నిర్మాణ పనులు

మండలంలోని వెంకటాపూర్, పెద్దతండా, సంగమేశ్వర తండాలో పంచాయతీ భవన నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. ఒక్క వెంకటాపూర్‌లో మాత్రమే పంచాయతీ భవన నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

– వినయ్ గౌడ్, పీఆర్‌ఏఈ

ఉదయం వేళ పనులకు హాజరవ్వాలి



చండూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సీతారావమ్మ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎండలు ఎక్కువ అవుతున్నందున ఉపాధి కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు హాజరై, ఎండలు ముదిరేలోగా పనులు ముగించుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చందూర్ గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు ఉపాధి పనుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యే ముందు, పనులు ముగిశాక తప్పనిసరిగా ఫొటోలు దిగాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే అత్యధిక కూలీ డబ్బులు వస్తాయన్నారు. అదేవిధంగా కూలీలకు పనుల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ భగవాన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జితేందర్, టీఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యం, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రేగోడ్(మెదక్): ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సీతారావమ్మ తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. ఉదయాన్నే చల్లటిపూట పనులు చేయాలని సూచించారు. ఫార్మేషన్ రోడ్డు, పంట పొలాల కాల్వలు, ఫీడర్ ఛానల్, పాంపాండ్స్, ఇంకుడు గుంత వంటి పనులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దశరథ్ నాయక్ ఉన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

27 లోగా దరఖాస్తు చేసుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిస్తుందని, రైతులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, జనరల్ రైతులకు 40 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎకరం భూమి ఉన్న రైతులు అర్హులన్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అల్లాదుర్గం మండల ఏఈఓలను, అల్లాదుర్గం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు వెంకటాపూర్(ఆర్)లో ఆలయ వార్షికోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లోని రమాసహిత వీరవేంకట సత్యనారాయణస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలు ఈనెల 26, 27వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న గణపతిపూజ, స్వామివారి అభిషేకం నవగ్రహ హోమం, మధ్యాహ్నం స్వామి వారి కల్యాణం, 27న సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోస్టాఫీస్‌లో సర్వర్ బంద్

కౌడిపల్లి(నర్సాపూర్): పోస్టాఫీస్‌లో ఐదు రోజులుగా సర్వర్ బంద్ కావడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. కౌడిపల్లిలోని సబ్ పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్ సమస్యతో సర్వర్ పనిచేయడంలేదు. దీంతో పోస్టాఫీస్‌కు వచ్చే ఖాతాదారులకు ఇవ్వాళ, రేపు అంటూ చెప్పి పంపుతున్నారని గ్రామస్తులు మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. సుకన్య సమృద్ధి యోజన పథకంలో డబ్బులు చెల్లించేందుకు వస్తే సర్వర్ పనిచేయడం లేదని వాపోయారు. ఎస్‌పీఎంకు తెలుగు మాట్లాడటం రాదని, స్థానిక బీపీఎంలతో పాటు పోస్టాఫీస్‌లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారన్నారు. ఖాతాదారులకు, పింఛన్ దారులను పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయమై డిప్యూటేషన్‌పై వచ్చిన ఎస్‌పీఎం శర్మను వివరణ కోరగా..సర్వర్ పనిచేయడం లేదని దీంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

మండుటెండల్లో ఆశావర్కర్ల రాస్తారోకో

ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం అనుసరించిన తీరును నిరసిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం చలో హైదరాబాద్ చేపట్టిన ఆశా వర్కర్‌లపై పోలీసులు అమానుషంగా దాడిచేసి అరెస్ట్ చేయడం దారుణమన్నారు.



పాపన్నపేట(మెదక్): రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు



చిన్నశంకరంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా వర్కర్లు



వెల్దుర్తిలో ..



శివ్వంపేటలో ఆశావర్కర్ల నిరసన

రోడ్డు విస్తరించాలని పాదయాత్ర

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం మెదక్‌లోని పిల్లి కొట్టాల్ వరకు గుంతలమయంగా మారిన బీటీ రోడ్డును రెండు లైన్‌ల రోడ్డుగా మార్చాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా నుంచి మెదక్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నర్సమ్మ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపుగా అన్ని మండల కేంద్రాల నుంచి ఆర్‌అండ్‌బీ లేదా పంచాయతీ రాజ్ రోడ్లను కలుపుతూ రెండు వరుసల రోడ్లు ఉన్నాయని, కానీ ఒక్క వెల్దుర్తి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి మాత్రం ఒకే వరుసగా ఉందన్నారు. ఉన్న రోడ్డు సైతం ధ్వంసం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ఒక వరుసలో ఉన్న రోడ్డును రెండు వరుసల రోడ్డుగా మార్చి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ఇటీవల సంతకాల చేపట్టి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని వెల్దుర్తి నుంచి మెదక్ వరకు వయా రామాయిపల్లి మీదుగా రెండు లైన్‌ల రోడ్డు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరేందర్, తాపీ మేస్త్రీలు, హమాలీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు వెడల్పు కోసం పాదయాత్ర చేస్తున్న నాయకులు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్లాస్టిక్ సేకరించి గ్రామసస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ ఎన్ఎస్ఎస్ శిబిరం యూనిట్–1 విద్యార్థులు మండలంలోని రెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్‌ను తొలగించి స్వచ్ఛభారత్ నిర్వహించారు. నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వేసవి శిబిరంలో భాగంగా రెడ్డిపల్లిలో వారం రోజుల పాటు, పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా యువతకు గంజాయి, మద్యపానం, ధూమపానంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో సుమారు 80 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించారు.

ముప్పిరెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో రెడ్‌క్రాస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్టీ పరిశ్రమ, మల్లారెడ్డి ఆస్పత్రి వారి సహకారంతో గ్రామంలోని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేసినట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వీఎస్టీ సీనియర్ మేనేజర్ కిషోర్‌కుమార్, సెక్యూరిటీ ఆఫీసర్ గోపికృష్ణ, ఎంపీడీఓ కృష్ణమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సుభాష్‌చంద్రబోస్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాసశర్మ, దామోదర్‌రావు, యాదగిరి, సత్యనారాయణ, కై లాసం, రమేష్, శ్రీనివాస్‌గుప్తా, సతీష్‌రావు, పీహెచ్‌సీ వైద్యులు జ్యోత్స్నదేవి, సీఎస్‌ఓ బాలనర్సయ్య, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, మల్లారెడ్డి వైద్యబృదం, పంచాయతీ కార్యదర్శి స్వామిగౌడ్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, వైద్యబృందం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కౌడిపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం రాత్రి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్దగల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహమ్మద్ నగర్, ముట్రాజ్‌పల్లి, వెంకట్రావ్‌పేట, రాయిలాపూర్, పాంపల్లి, అంతారం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు రూ 4.02లక్షల చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు కొట్టాలలో ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. లింగంపల్లి, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రఘు, బాలగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌పాషా, రాయిలాపూర్ మాజీ సర్పంచ్ శేఖులు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పర్వతాలు, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. జూకల్‌కు చెందిన సంగయ్యకు రూ.33 వేలు, పేటకు చెందిన ఎండీ.ఇస్మాయిల్‌కు రూ.60 వేల చెక్కులను మాజీ ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో శ్రేయారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు సురేశ్‌గౌడ్, కన్నయ్యగారి రమేష్, దత్తు, నర్సింలు, శంకర్‌గౌడ్, యాదుల్‌హుస్సేన్, నర్సింలు, విఠల్‌గౌడ్, నీలకంటి విఠల్, భూంరెడ్డి, కిషన్ తదితరులున్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను, హిటాచీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. సోమవారం మండల కేంద్రం మనోహరాబాద్‌లో అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీలో నాలుగు టిప్పర్లు, ఒక హిటాచీని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ శాంతి భద్రతల్లో ప్రభుత్వం విఫలం

చేగుంట(తూప్రాన్): నగరంలో శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నగరంలో న్యాయవాది ఎర్రబాబు హత్య, ఎంపీ డీకే అరుణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చొరబడటం, ఎంఎంటీఎస్ రైలులో మహిళపై హత్యాచార యత్నం లాంటి వరుస ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు శేఖర్, భిక్షపతి, మాజీ ఎంపీటీసీ హరిశంకర్, సాయిబాబా, శ్రీకాంత్, రతన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

◆ గోమారం తైబజార్‌కు లక్ష 28 వేలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం తైబజార్ నిర్వహణ కోసం మంగళవారం గ్రామ పంచాయతీలో బహిరంగా వేలంపాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ నాగేశ్వర్, ఎంపీఓ తిరుపతిరెడ్డి సమక్షంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పలువురు వ్యక్తులు పాల్గొనగా గ్రామానికి చెందిన చందర్‌గౌడ్ రూ.లక్ష 28 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్యారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, నాయకులు ఉన్నారు.

◆ గవ్వలపల్లిలో తైబజార్ రూ.3.48 వేలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం తైబజార్ వేలపాట నిర్వహించారు. వేలం పాటలో 14 మంది పాల్గోనగా, గ్రామానికి చెందిన బీరయ్య రూ.3.48 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. డీఎల్‌పీఓ సురేశ్‌బాబు, గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మీప్రవీణ్, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం గ్రామ ప్రత్యేకాధికారి, డిప్యూటీ తహసీల్దార్ రమ్య శ్రీ ఆధ్వర్యంలో తైబజారు వేలం పాట నిర్వహించారు. మండల కేంద్రం తైబజారును బండారి చంద్రయ్యకు రూ. 2.25 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహారెడ్డి, కొండల్‌రెడ్డి, గ్రామస్తులుపాల్గొన్నారు.

◆ ఉగాది ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా జరిగే ఉత్సవాల కరపత్రాన్ని గ్రామస్తులు, ఆలయ కమిటీ, భజనమండలి సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా మాట్లాడుతూ రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులు ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న వేంకటేశ్వరస్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు, సాయంత్రం బండ్ల ఊరేగింపు, 31న పాచిపండ్ల ఊరేగింపు, అన్నదానం, ఏప్రిల్1న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, కుంకుమార్చన, రాత్రి కల్యాణం, అర్ధరాత్రి లంకదహనం, తెల్లవారుజామున రథోత్సవం, 2న శ్రీవారి చక్రస్నానం, అభిషేకం ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ బంజారా ఉద్యోగుల సేవాసంఘ్ ఆర్థిక సాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని గొల్లపల్లి జెత్రంతండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీ రమేశ్‌నాయక్ కుటుంబీకులకు తెలంగాణ బంజారా ఉద్యోగుల సేవాసంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ బంజారా ఉద్యోగుల సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో రూ. 26 వేయిల విరాళం సేకరించి బాధిత కటుంబీకులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం, మెదక్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంచందర్, మణిరాం, సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ,మెదక్ జిల్లా నాయకులు, ఎంఈఓ బుచ్యానాయక్ నర్సాపూర్ నాయకులు చెన్నా, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

◆ శేరితండాలో నీటి సమస్య

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండాలో నీటి సమస్య ఉందని పరిష్కరించాలని తండావాసులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తండాకు చెందిన అమర్‌సింగ్, లోక్య, పాండు, శ్రీనివాస్, ప్రవీణ్, పూల్‌సింగ్ తదితరులు ఎంపీడీఓతో మాట్లాడుతూ.. మూడు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని వాపోయారు. బోరు నీళ్లు ట్యాంక్‌కు వస్తుండటంతో ఇబ్బంది రాలేన్నారు. ప్రస్తుతం బోరుబంద్ అయిందని దీంతో నీటి సమస్య తీవ్రమైందని చెప్పారు. పరిశీలించి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు.